క్లుప్తంగా

1న పాటల పోటీలు

మాచర్ల : ఉమ్మడి రాష్ట్రాల పరిధిలో స్వర నీరాజనం పేరిట తెలుగు సినిమా పాటల పోటీలు జూన్ 1న పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కమలహసన్‌రావు గురువారం తెలిపారు. గాన గంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎంట్రీ ఫీజు లేదని, ఆ రోజు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పాటల పోటీలకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 7వేలు, తృతీయ బహుమతి రూ. 5వేలు, నాలుగో బహుమతి రూ. 4వేలు, ఐదో బహుమతి రూ. 3వేలు అందజేస్తామని పేర్కొన్నారు. వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9441065681ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంటు పునరుద్ధరణ



మాచర్ల: ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి గురువారం పునరుద్ధరణ చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. చాలా రోజులుగా ఆర్వో ప్లాంట్ వినియోగంలో లేదని చెప్పారు. తాగునీటికి ప్రయాణికుల ఇబ్బంది రీత్యా అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

చలివేంద్రం ప్రారంభం



మాచర్ల : పట్టణంలో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక సేవలు అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్ గుప్తా, సదాశివరాజు, హరిశ్చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



మాచర్ల: పట్టణంలోని రింగ్ రోడ్డు సెంటర్‌లో గల పెట్రోలు బంకు వద్ద గురువారం ఉదయం బీసీ నాయకురాలు కృష్ణవేణి అన్నదానాన్ని నిర్వహించారు. తన తల్లి జ్ఞాపకార్థం 300 మందికి అన్నదానం చేసినట్లు ఆమె తెలిపారు.

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండలంలోని పాలువాయి జంక్షన్‌లో గల షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం దేవస్థానం ప్రధాన అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం ఆవరణలో భజన బృందం ఆలపించిన బాబా గీతాలతో భక్తులు తన్మయత్వం చెందారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు తీర్థ ప్రసాదాలను అందచేసి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పశువుల దాణా పంపిణీ



కారెంపూడి: స్థానిక పశు వైద్య శాలలో గురువారం పాడి రైతులకు పశువుల దాణా, పశుగ్రాస విత్తనాలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి, జిల్లా పశు వైద్య శాఖాధికారి కె. కాంతారావు, గుంటూరు ఏడీ ఆర్. శ్రీనివాసరావు, స్థానిక పశువైద్యాధికారి డి. దిలీప్ పాల్గొన్నారు.

19న వైస్ ఎంపీపీ ఎన్నిక

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఈనెల 19న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

అధికారులతో సమీక్ష సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల: ప్రజా సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గోనేరే ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గం స్థాయి ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ, ఆర్‌డీఓ మురళీకృష్ణ, నియోజకవర్గంలోని గ్రామ స్థాయిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ శాఖ, బ్యాంకు రుణాలు, రెవెన్యూ, అటవీ భూములు, పంచాయతీరాజ్, మెడికల్ అండ్ హెల్త్‌తో పాటు వివిధ శాఖల అధికారుల నుంచి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఉపాధి హామీ పథకం కిందట కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో తాగునీటి సరఫరాలో ఎవరికి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. డీఫై ఎఫ్ఆర్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారులకు, నియోజకవర్గంలోని తహసీల్దార్లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ఎంపీపీ కందుల జాను



దాచేపల్లి : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కందుల జాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఉన్నట్లుగా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే మంచినీటి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. మంచినీటి బోర్లు, చేతి పంపులకు మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా ప్రజలకు అందించాలని ఆయన తెలిపారు. పైపులైన్లకు లీకేజీలు లేకుండా మరమ్మతులు, మంచినీటిని నిల్వ చేసే ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రం చేయాలని సూచించారు. చెరువుల్లో నీళ్లు నింపేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో అధికారులు పర్యటించి తాగునీటి సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఆయన కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కూడా చర్యలు తీసుకోవాలని, కాలువల్లో పూడికతీసి బ్లీచింగ్ చల్లించాలని ఎంపీపీ సూచించారు. వేసవి ముగిసేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని ఆయన సూచించారు.

పాలిసెట్‌లో మౌనికకు జిల్లా ఫస్ట్ ర్యాంక్



పిడుగురాళ్ల: పాలిసెట్‌లో స్థానిక మాస్టర్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిలో కె. మౌనిక 120 మార్కులకు గాను (117) సాధించి జిల్లా మొదటి స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. అభినాష్ (110), కె. అక్షయ (109), వై. జ్ఞాన సాయి (100) మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. మంచి ఫలితాలను సాధించిన విద్యార్థుల్ని మాస్టర్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు కె. ప్రవీణ్‌కుమార్, జి. రాజు పాల్గొన్నారు.

రేషన్ సమస్యలు పరిష్కరించాలి

సాక్షి ఎఫెక్ట్

నాదెండ్ల: నూతన రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల చేరికలు, తొలగింపులు, చిరునామా మార్పులు, సవరణలపై ఈ నెల 6వ తేదీ నుంచి మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రక్రియ కొనసాగుతున్న సంగతి విదితమే. మేజర్ పంచాయతీ గణపవరం, పసుమర్రు గ్రామాల్లో ప్రక్రియ నేటికీ ప్రారంభం కాకపోవడంపై సాక్షి దినపత్రికలో గురువారం 'రేషన్‌కార్డుల దరఖాస్తులకు సాంకేతిక సమస్యలు' అంటూ కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు సిబ్బందితో కలిసి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన రాష్ట్ర సచివాలయ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. రెండు గ్రామాల సమస్య పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రెండు గ్రామాలను చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, స్థానికులు హైకోర్టును ఆశ్రయించటంపై విలీన ప్రక్రియపై స్టే విధించారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాల వెబ్‌సైట్‌లలో మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన సేవలపై సమస్యలు తలెత్తుతున్నాయి.

వైభవంగా అమ్మవారి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఈపూరు(శావల్యాపురం): ఈపూరు మండలంలోని కొచ్చర్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీఅంకాళ్ళ పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ల వేడుకలు గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి సన్నిధిలో మహిళలు పొంగళ్ళు పొంగించి, పసుపుకుంకుమ, నూతన వస్త్రాలు అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గంలో ప్రసిద్ధి గాంచిన, విశిష్టత కల్గిన అమ్మవారిని దర్శించుకునేందుకు ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు బారులుతీరారు. గత నాలుగు రోజుల నుంచి గ్రామ పురవీధుల్లో సిడిమాను ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరిరోజు ఉదయం 10 గంటలకు ముగిసిన తదుపరి తిరునాళ్ల వేడుకలు జరుపుకోవడం గత కొన్ని సంవత్సరాలు అనవాయితీగా వస్తోంది. భక్తులు కోర్కెలు తీర్చే అమ్మవారిని కొచ్చర్లతండా, కొచ్చర్ల, కొండ్రముట్ల, దుశ్శాన్‌పేట, సత్యనారాయణపురం, శ్రీనగర్, కొండ్రముట్లపాలెం,అంగలూరు తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తిరునాళ్ల వేడుకలు సందర్భంగా అమ్మవారి ప్రాంగణంలో భారీ అన్నదానాన్ని కాకుమాను సుబ్రమణ్యం, యాదవ సంఘం నేతలు నిర్వహించారు. ఆరు విద్యుత్ ప్రభలు, పాట కచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేశారు. దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకరరావు సారథ్యంలో ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు 200 మంది పోలీసు సిబ్బందితో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం వాటిల్లికుండా, భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రచారం

కళాజాత బృందం వీధి నాటకం



మార్కెట్‌సెంటర్‌లో కళాజాత బృంద సభ్యులు ప్రదర్శిస్తున్న వీధి నాటకం

నరసరావుపేట: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కళాజాత బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన కోసం ప్రచారం ప్రారంభించింది. గురువారం హాండ్స్ ఆఫ్ కంఫాషన్ ఆధ్వర్యంలో గాయత్రి కల్చరల్ సొసైటీ నాగరాజు కళాజాత బృందం స్థానిక మార్కెట్ సెంటర్‌లో వీధి నాటకాలను ప్రదర్శించింది. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు, వ్యాధిగ్రస్తులపై వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో కలిసి జీవించే విధానం, క్షయ వ్యాధి సంబంధం, వ్యాధి ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పాటల రూపంలో వివరించారు. సుఖవ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగం, హెచ్ఐవీ చట్టం–2017 గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ పరీక్ష అన్నీ ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని, వ్యాధి ఉన్నవారు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవితకాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. క్రమం తప్పకుండా సీడీ4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాండ్స్ ఆఫ్ కంఫాషన్ ప్రీవెన్షన్ యూనిట్ ఎన్జీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్, ఐసీటీసీ కౌన్సిలర్స్ రవి, రజని, వాసవి, మీరా, మేరీ, శివరాజు పాల్గొన్నారు.

సేవా భూషణ్ అవార్డు గ్రహీత పొలేష్‌కు సన్మానం

వినుకొండ: సేవా భూషణ్ అవార్డు పొందిన దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పెద్దేటి పొలేష్‌ను పట్టణంలో పుర ప్రముఖులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గత కొన్ని సంవత్సరాలుగా దళిత గిరిజన వర్గాలకు పొలేష్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, నక్కా నాగిరెడ్డి, ఎంపీటీసీ జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయం కన్వీనర్ పి.అవినాష్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కట్టెంపూడి పిచ్చయ్య, ఎంపీటీసీ దూపాటి గాలెయ్య, కట్టెంపూడి చెన్నయ్య, కొమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాక నాగిరెడ్డి, తెల్లమేకల రాజా, గద్ద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం చట్టరీత్యా నేరం

బొల్లాపల్లి : బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం నేరమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఈపూరు సర్కిల్ ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈపూరు ఎక్స్ స్టేషన్ పరిధిలో గురువారం బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిలుపుదల చేసినట్లు తెలిపారు. ప్రతి పౌరుడు ఎక్సైజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఎస్ఐ కె.శ్రీనివాసరావు సూచించారు.

సంక్షిప్త వార్తలు

యార్డ్ కమిటీ నియమిస్తూ జీవో

నరసరావుపేట రూరల్: నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా పూనాటి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా కాసా ఆంజనేయులుతో పాటు 14 మందిని నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరితో పాటు లింగంగుంట్ల సొసైటీ ఇన్‌చార్జ్, వ్యవసాయ ఏడీఏ, మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

వినుకొండ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ వాటర్, కరెంటు సెక్షన్‌ల ఆఫీస్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలోని కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బూదాల మాట్లాడుతూ కార్మికులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే మున్సిపాలిటీలో పనిచేస్తున్న అన్ని శాఖల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండ్రముట్ల సుభాని, కొప్పరపు మల్లికార్జున, పచ్చిగొర్ల ఏసు, మస్తాన్, గాలెయ్య, శ్రీను, నాసరయ్య పాల్గొన్నారు.

ఈ సెట్ ఫలితాల్లో బోయపాలెం విద్యార్థినికి ర్యాంకు



యడ్లపాడు: గురువారం విడుదలైన ఏపీఈసెట్ ఫలితాల్లో పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామ విద్యార్థిని దొరడ్ల సత్య వెంకటనాగలక్ష్మీ ప్రణతి సత్తా చాటింది. బ్రాంచ్ స్థాయిలో 237వ ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 292వ ర్యాంక్ సాధించిన ప్రణతి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. గ్రామానికి చెందిన దోరడ్ల మల్లికార్జునరావు, సౌజన్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రెండో సంతానమైన ప్రణతి పుల్లడిగుంటలోని మల్నేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా కోర్సు పూర్తి చేసింది. ఈసెట్ ద్వారా ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశానికి అర్హత సాధించింది. పట్టుదలతో చదువును కొనసాగిస్తూ ఈసెట్‌లో ర్యాంక్ సాధించిన ప్రణతి కృషికి పలువురు అభినందనలు తెలిపారు.

పాలిసెట్‌లో నూజెండ్ల విద్యార్థినికి ర్యాంకు



నూజెండ్ల: మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన తాటిపర్తి స్నేహలతారెడ్డి పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో 237వ ర్యాంక్ సాధించింది. గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబం. గ్రామీణ విద్యార్థిని స్నేహలతారెడ్డి స్టేట్‌ర్యాంక్ సాధించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

శావల్యాపురం: పూర్వ విద్యార్థులు సహకారం అభినందనీయమని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. గురువారం 1999–2000 విద్యా సంవత్సరంలో శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.30వేలు ఆర్థిక చేయూత అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి సహకారం అందించడం పలువురికి ఆదర్శమన్నారు. పాఠశాల అభ్యున్నతికి రూ.20వేలు. క్రీడా సామగ్రికి రూ.7వేలను ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మికి అందజేశారు. రూ.3,500 విలువైన బ్యాట్‌ను రావినూతల రత్నకీర్తన అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల స్థల దాతలు పద్మనాభుని హనుమంతరావు, గట్టుపల్లి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి,రికార్డు అసిస్టెంట్ శ్రీకాంత్, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు రెడ్డి వెంకట కిరణ్‌కుమార్, ఏలికా శ్రీనివాసరావు, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్న ఏఓ

రెంటచింతల: పంటలను సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, భూముల్లో సూక్ష్మ పోషకాలపై ఒక అవగాహన ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మరెడ్డి అన్నారు. ఆయన మండలంలోని 11 గ్రామాల్లోని పొలాల్లో సేకరించిన 1,343 మట్టి నమూనాలను పరీక్షల నిమిత్తం నర్సరావుపేటలోని ఎస్‌టీఎల్ ల్యాబ్‌కు గురువారం పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి 748 మట్టి నమూనాల సేకరించాలని, రైతుల విన్నపం మేరకు 1,343 సేకరించినట్లు తెలిపారు. భూమిలో సూక్ష్మ పోషకాల లోపాల వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని ఆయన రైతులకు సూచించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన సూచించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలకు ఎరువులు వాడుకోవాలని తెలిపారు. జీవన ఎరువుల వాడకం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చని చెప్పారు. సూక్ష్మపోషకాల లోపాల వల్ల పలు తెగుళ్ల పంటలకు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన సూచించారు.

పోస్ట్ వ్యాక్సినేషన్ సీరం నమూనాల సేకరణ



గోవు నుంచి రక్త నమూనా సేకరిస్తున్న పశువైద్య అధికారులు, సిబ్బంది

రొంపిచర్ల: పశువుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షించటం ద్వారా క్షేత్రస్థాయిలో టీకాల నిర్వహణ అవసరాన్ని నిర్ధారించవచ్చు అని వెటర్నరీ బయోలాజికల్ రిసెర్చ్ ఇనిస్ట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి. సనేలీ కుమారి అన్నారు. మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో నిర్వహించిన పోస్ట్ వ్యాక్సినేషన్ సీరం నమూనాల సేకరణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో టీకాల నిర్వహణ కార్యక్రమాన్ని పర్యవేక్షించటానికి ప్రతి జిల్లా నుంచి యాదృచ్ఛికంగా కొన్ని గ్రామాలను ఎంపిక చేయటం జరిగిందన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పశువుల నుంచి రక్తనమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేసి క్షేత్రస్థాయిలో టీకాల నిర్వహణ అవసరాన్ని నిర్ధారిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. కళావతి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ డి. వంశీప్రసాద్, వీఏ కె. లింగమ్మ, ఏహెచ్‌ఏలు జి. బాలి, కె. వీరబ్రహ్మం, షేక్ హమ్మద్ బాషా, గోపాలమిత్ర దొండేటి కృష్ణారెడ్డి, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించండి

57వ రోజుకు చేరిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు నియంతృత్వ పోకడలు వీడి కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరిన 36 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకుని రూ.21 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 57వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సాల్మన్ మాట్లాడుతూ కార్మికుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆప్కాస్ ఉన్నప్పటికీ ఔట్ సోర్సింగ్ కార్మికుల మంటూ నెలలో 30 రోజులు పనిచేసినా 10 నుంచి 15 రోజులకు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారన్నారు. అయినప్పటికీ ఆరేళ్లు విధులు నిర్వహించామని, చివరికి విసిగి వేశారి తప్పని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెకు పూనుకున్నామన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఇంచార్జ్ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం తమ స్థానంలో బయటి వ్యక్తులకు రోజుకు రూ.700 చెల్లించి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారని, అవే వేతనాలు తమకు ఇవ్వండని అడుగుతుంటే వివక్ష ఎందుకన్నారు. పట్టణంలో అన్నీ వీధులను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నా కష్టాన్ని గుర్తించకుండా నియంతృత్వ ధోరణి అవలంబించడం దారుణమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను తెలియజేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకుని సమాన పనికి సమాన వేతనం వారాంతపు, పండగలు, ఇతర ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ బదిలీలలో ప్రభుత్వ వైఖరి సరికాదు

ఎస్టీయూ స్టేట్ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు



మాట్లాడుతున్న పోటు శ్రీనివాసరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వ వైఖరి మారాల్సిన అవసరం ఉందని ఎస్టీయూ స్టేట్ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో గురువారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాలు కోరిన అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలలకు పంపడం తిరోగమన చర్య అవుతుందని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో డీఎడ్ పూర్తి చేసిన వారిని కొనసాగించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉల్లంఘించటం సరికాదన్నారు. స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పంపకుండా ఎస్‌జీటీలకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిన వెబ్ కౌన్సెలింగ్‌లో ఇబ్బందులు సరిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, మగ్బూల్‌బాష, దుర్గా ప్రసాద్, జి.కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి, సీహెచ్ మల్లేశ్వరరావు, జిల్లా మహిళా కన్వీనర్ ఎం.శారద పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు



వివరాలు తెలుపుతున్న విద్యుత్ శాఖ అధికారులు

చిలకలూరిపేట: అనధికార విద్యుత్ వినియోగం నియంత్రణలో భాగంగా ఆ శాఖ అధికారులు గురువారం విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌డీఏ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ పి సుబ్రహ్మణ్యం, గుంటూరు టౌన్ -2 ఈఈ వై ఏడుకొండలు, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండల పరిధిలోని 19 గ్రామాలలో 44 బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనధికారికంగా అధిక విద్యుత్ లోడు వినియోగించుకుంటున్న 150 సర్వీసులను గుర్తించి రూ. 6 లక్షలు, అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న నాలుగు సర్వీసులు గుర్తించి రూ. 1.20 లక్షలు, బిల్లింగ్ తేడా ఉన్న ఒక సర్వీసుకు రూ. 30వేలు అపరాధ రుసుం విధించారు. విద్యుత్ చౌర్యం అనేది సామాజిక నేరం కింద పరిగణించబడుతుందని, దానికి జైలుశిక్ష కూడా ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. తరుచుగా దాడులు నిర్వహించి,కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఈలు ఏ. గురునాథరావు, ఎస్. మల్లిఖార్జునరావు, కె.రవికుమార్, ఆర్.అశోక్‌కుమార్, 11 మంది ఏఈఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.